# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 26 సెప్టెంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 55

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరిక

**అప్రమత్తంగా ఉండాలని సిఎం ఆదేశం**




## ముగ్గురు బాలికలపై అత్యాచారం

**అల్వాల్ నుంచి యాదగిరిగుట్ట**

**పరిచయం లేని యువకులు**

**ప్రేమ పేరుతో నయవంచన**

**చివరకు ఫోక్సో కింద జైలుకు**



# సర్కారు చేతికి మెట్రో

- కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్ మధ్య చర్చల్లో అంగీకారం
- బ్యాంకుల నుంచి ఆ సంస్థ తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణం బాధ్యత ప్రభుత్వానిదే
- మరో రూ.2 వేల కోట్లు ఈక్విటీ కింద చెల్లించేలా ఒప్పందం



హైదరాబాద్: హైదరాబాద్ మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రభుత్వం చేతిలోకి రానుంది. మెట్రో రైలును కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్ మధ్య గురువారం జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. గత కొన్ని రోజులుగా పలు ప్రత్యామ్నాయాలపై చర్చలు జరగగా... గురువారం జరిగిన చర్చల్లో తుది నిర్ణయానికి వచ్చారు. మెట్రో రైలు కోసం బ్యాంకుల నుంచి ఎల్ అండ్ టీ తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణం బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. మరో రూ.2 వేల కోట్లను ఎల్ అండ్ టీకి ప్రభుత్వం ఈక్విటీ కింద చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణలో ఇది కీలకంగా మారనుంది. ఈ నిర్ణయం అమలుకు తదుపరి కార్యాచరణ ప్రారంభిస్తు న్నామని, ఇది పూర్తయితే దేశంలో ఉన్న 23 మెట్రోలలో ప్రైవేటు రంగం చేతిలో ఉన్న ఒకే ఒక మెట్రో కూడా ప్రభుత్వం చేతికొచ్చినట్లు అవుతుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

రెండో దశకు అడ్డంకిగా మారకూ దదని...

వచ్చే మూడేళ్లలో మెట్రో రైలు రెండో దశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని... కేంద్రానికి డీపీఆర్ పంపింది. అయితే మొదటి దశ ఎల్ అండ్ టీ చేతిలో ఉన్నందున ఆ సంస్థతో అవగాహనకు రావాలని కేంద్రం సూచించడంతో పాటు పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఒప్పందం చేసుకోవడానికి ఎల్ అండ్ టీ అంగీకరించకపోవడంతో... రెండో దశకు అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో మొదటి దశను ప్రభుత్వమే తీసుకోవాలని నిర్ణయించింది. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఎల్ అండ్ టీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అవి ఓ కొలిక్కి వచ్చిన తరువాత గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రమణ్యన్, సంస్థ సీఎండీ సలహాదారు డి.కె.సేన్, ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ కె.వి.బి.రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పట్టణ రవాణా ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్.రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మెట్రో రైలు ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు. మొదటి, రెండో దశ కలిపి నిర్వహణ తదితర అంశాలపై చర్చించిన తరువాత మొదటి దశ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేయడానికే ప్రభుత్వం మొగ్గు చూపింది. దీనికి ఎల్ అండ్ టీ కూడా అంగీకారం తెలిపింది.

## దేశ రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ఉత్తర్ ప్రదేశ్‌లో భారత రక్షణరంగ ఉత్పత్తుల్ని మరింత బలోపేతం చేస్తూ రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. గురువారం ఉత్తర్ ప్రదేశ్ లోని నోయిడాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన సందర్భంగా మాట్లాడిన మోదీ.. భారత సైన్యం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్) లక్ష్యంతో విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 'మన సైన్యం స్వయం సమృద్ధిని సాధించాలని, విదేశీ మూలాలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ఆశిస్తోంది. ఈ లక్ష్యానికి, భారతదేశంలో బలమైన రక్షణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాం. ప్రతి ఉత్పత్తి 'మేడ్ ఇన్ ఇండియా'గా ఉండాలని నొక్కి చెబుతున్నాం. దీనికి మద్దతుగా, ఉత్తర్ ప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోంది. రష్యా సహాయంతో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుంది' అని పీఎం మోదీ చెప్పారు. ఉత్తర్ ప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నామని.. ఇక్కడ బ్రహ్మోస్ మిస్సైళ్లు, ఇతర ఆయుధ వ్యవస్థల తయారీ ఇప్పటికే జరుగుతోందని మోదీ చెప్పారు. ఇందులో భాగంగానే, 'అల్టిమేట్ సోర్సింగ్ బిగిన్స్ హియర్' అనే థీమ్‌తో సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని తెలిపారు.

## స్థానిక ఎన్నికలపై బిఆర్ఎస్ అప్రమత్తం

**నేతలను అలర్ట్ చేసిన వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

**ముఖ్యనేతలతో కెటిఆర్, హరీష్ రావుల టెలి కాన్ఫరెన్స్**



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో బిఆర్ఎస్ అప్రమత్తం అయ్యింది. పార్టీ శ్రేణులను,కార్యకర్తలను అలర్ట్ చేసింది. ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. పార్టీ నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు- చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అందరితో మమేకమై ఉండే గెలుపు గుర్రాలకు పోటీకి అవకాశం కల్పించేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. ప్రజలు భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ వైపు ఎదురు చూస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక సమస్యల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పల్లె ప్రగతి పేరిట గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి హయాంలో చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు.. ఇప్పుడు పల్లెల్లో పరిస్థితిని కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. బతుకమ్మ పండుగకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సరైన ఏర్పాట్లు- చేయలేదని, తెలంగాణ సంస్కృతి పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా భారత రాష్ట్ర సమితి నేతల ద్వారా బతుకమ్మ కోసం ఏర్పాట్లు- చేసేలా చూడాలని సూచించారు.అదే సందర్భంలో ప్రజలతో నిత్యం సంబంధాలు నెరుపుతూ ముందుడాలని అన్నారు.

# దసరాలోపే గ్రూప్-2 ఫలితాలు!




**హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రూప్-2 సర్వీసుల పోస్టుల తుది ఫలితాల వెల్లడికి టీజీపీఎస్సీ సిద్ధమైంది. దసరా పండగలోపు తుది ఫలితాలను వెల్లడించడంతోపాటు నియామకపత్రాలు అందించాలని భావిస్తోంది. ఈ మేరకు పరిపాలన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. నాలుగైదు రోజుల్లో ఎంపికలకు సంబంధించిన ప్రక్రియ పూర్తవుతుందని సమాచారం. గ్రూప్-2లో 783 పోస్టుల భర్తీకి ఇప్పటికే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసింది. యూనిఫాం పోస్టులకు అర్హులైనవారి వైద్య నివేదికలూ అందాయి. అభ్యర్థుల విద్యార్హతలు, ఆప్షన్లు, మెరిట్, రిజర్వేషన్లు తదితర విషయాలు పరిగణనలోకి తీసుకుని తుది జాబితాను రూపొందించనుంది. టీజీపీఎస్సీ 783 పోస్టులతో 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ జారీచేసింది. 2024 డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించి... ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకుల జాబితాను వెల్లడించింది. అనుకున్నట్లు అన్నీ పూర్తయితే రాతపరీక్షలు నిర్వహించిన ఏడాదిలోగా నియామక ప్రక్రియ పూర్తికానుంది.




## దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం

- రూ.30 వేల కోట్లతో రోడ్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం
- రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారుల నిర్మాణం
- రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రహదారులపై చర్చ
- మీడియా సమావేశంలో వెల్లడించిన కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ఫోబియా పట్టుకుందని విమర్శలు

**తెలంగాణ ప్రాజెక్టులకోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేసుకుని.. అన్నిరకాల అభివృద్ధి పనులను మానిటర్ చేస్తున్నాను.. మా పార్టీ తెలంగాణ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తుంది.. రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో విషయంలో.. అందరికంటే ముందే మేం ప్రొయాక్టివ్ గా వ్యవహరించామని తెలిపారు.**

# అల్పపీడన ప్రభావంతో మళ్లీ వర్షాలు

**రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు**

**హైదరాబాద్ వాతావరణకేంద్రం హెచ్చరిక**

**ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా వాన**

రాగల 24గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా వాయువ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు-మధ్య దానికి ఆనుకొని ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీదుగా మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 26వ తేదీ వరకు పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది.



వేగుచుక్క

# "కడారి"కి కన్నీటి వీడ్కోలు..



నివాళులు అర్పించిన ప్రజాసంఘాల నాయకులు.

ఎర్రబారిన గోపాలరావు పల్లె.



**వేగుచుక్క న్యూస్,సిరిసిల్ల, సెప్టెంబర్ 25**

మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణ రెడ్డి మరణంతో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గోపాలరావు పల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కడారి సత్యనారాయణ రెడ్డి మృతదేహం గురువారం స్వగ్రామం చేరింది. పలు పార్టీల, ప్రజాసంఘాలు నాయకులు కడారి స్వగ్రామంలో నివాళులు అర్పించారు. ప్రజా సంఘాల నాయకులు గాదె ఇన్నయ్య, విరసం కార్యదర్శి పాణి, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ నాయకురాలు పద్మతో పాటు సిపిఐ, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు సత్యనారాయణ రెడ్డి కి నివాళులు అర్పించి ఆయన ప్రజల కోసం చేసిన త్యాగాన్ని కొనియాడారు. ప్రజా కళామండలి కళాకారుల విప్లవ పాటలు గోపాల్ రావు పల్లెలో మారుమోగాయి. ఈ సందర్భంగా గాదే ఇన్నయ్య తో పాటు పౌర హక్కుల సంఘం నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేసిన హత్యాకాండ అని బూటకపు ఎన్కౌంటర్ లో సత్యనారాయణ రెడ్డిని చిత్రహింసలు చేసి కాల్చి చంపారని ఆరోపించారు. ముమ్మాటికి ఇది ప్రభుత్వం చేసిన హత్య అన్నారు. అంచలంచెలుగా ప్రజా పోరాటాలలో నాలుగు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలలో పనిచేస్తూ మావోయిస్టు కేంద్ర పార్టీ స్థాయికి ఎదిగారని అన్నారు. ద్రోహుల సమాచారంతో కామ్రేడ్ కడారి సత్యనారాయణరెడ్డి తోపాటు మరో కేంద్ర కమిటీ సభ్యులు రాజు ను చత్తీస్గఢ్ నారాయణపూర్ జిల్లా అబూజ్ మడ్ సరిహద్దుల్లో బూటకపు ఎన్కౌంటర్ లో కాల్చి చంపారని ఆరోపించారు. విప్లవ అభిమనులు కడసారి కన్నీళ్ళతో జోహార్లు అర్పించారు. గ్రామస్తులు కడారికి పూర్వం గ్రామంతో ఉన్న సంబంధాలను గుర్తుచేసుకునీ కంటతడి పెట్టారు. గోపాల్ రావు పల్లి గ్రామం ఎర్రజెండాలతో రెపరెపలాడింది. ప్రజా కళామండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించి కడారి కి జోహార్లు అర్పించారు.



# అల్పపీడన ప్రభావంతో మళ్లీ వర్షాలు

హైదరాబాద్:తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటున సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించిందని ఉందని పేర్కొంది. రాగల 24గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా వాయువ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు-మధ్య దానికి ఆనుకొని ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీదుగా మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 26వ తేదీ వరకు పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది.27వ తేదీ నాటికి తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. ఏపీ, తెలంగాణ మీదుగా సముద్రమట్టానికి ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే

సూచనలున్నాయని వివరించింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నారాయణపేట, నారాయణపేట జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే, శని-ఆదివారాల్లోనూ పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇదిలావుంటే ములుగు జిల్లాల్లో వర్షం దంచి కొట్టింది. గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వాన పడుతున్నది. జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరు నాగారం, తాడ్వాయి, ములుగు, గోవిందరావుపేట, మల్లంపల్లి మండలాల్లో ఆగకుండా వాన కురిసింది. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నారు. లోతట్టు-ప్రాంతాలు జలమయ మయ్యాయి. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వానలు పడుతాయని తెలిపింది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని పేర్కొంది. శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఇక శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# ముగ్గురు బాలికలపై అత్యాచారం



హైదరాబాద్: అసలు పరిచయమే లేని ముగ్గురు బాలికలను ప్రేమిస్తున్నామని మాయమాటలు చెప్పి.. వారిపై అత్యాచారానికి పాల్పడ్డారు ముగ్గురు యువకులు. బాలికలను హైదరాబాద్ నగరం నుంచి యాదగిరి గుట్టకు తీసుకెళ్లి అక్కడ ఓ లాడ్జ్‌లో అత్యాచారం చేశారు. హైదరాబాద్ అల్వాల్ చెందిన ముగ్గురు బాలికలను విహార యాత్ర పేరుతో యాదగిరిగుట్టకు తీసుకెళ్లి వాళ్లపై ముగ్గురు యువకులు అత్యాచారం చేశారు. ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... 20న పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఉన్నాయని తల్లిదండ్రులకు తొమ్మిదో తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు చెప్పి బయటకు వెళ్లారు. తార్నాకకు చెందిన గండికోట మధు(19) జిహెచ్ఎంసిలో ఒప్పంద కార్మికుడుగా పని చేస్తున్నాడు. ముగ్గురు బాలికలతో మధుకు పరిచయం ఉండడంతో మాయమాటలు చెప్పి హోటల్‌కు తీసుకెళ్లి తన స్నేహితుడు అరవింద్(22), ఈసం నీరజ్(21)లను పరిచయం చేసిన అందరూ కలిసి భోజనం చేశారు. విహారయాత్రకు యాదగిరిగుట్టకు వెళ్దామని వారిని తీసుకెళ్లారు. అక్కడి వెళ్లిన తరువాత మూడు వేర్వేరు రూమ్‌లు బుక్ చేసి వారిపై అత్యాచారం చేశారు. అనంతరం తార్నాకలో వారిని వదిలిపెట్టి వెళ్లిపోయారు. తమపై అత్యాచారం జరిగిన విషయం బాలికలు తల్లిదండ్రులకు చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి ముగ్గురితో పాటు రూమ్ అద్దెకు ఇచ్చిన సోమేశ్‌ను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇక మరికొన్ని వివరాల ప్రకారం... అల్వాల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలికలు బతుకమ్మ ఆడటానికని తమ నివాసాల్లోంచి బయల్దేరారు. 9వ తరగతి చదువుతున్న ఈ ముగ్గురు బాలికలు కూడా ఉస్మానియా యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లోకి వచ్చారు. అక్కడున్న ఓ యువకుడు వారిపై కన్నేశాడు. వారి దగ్గరికి వెళ్లి మాట కలిపాడు. తియ్యని మాటలు మాట్లాడుతూ.. ప్రేమిస్తున్నట్లు-చెప్పాడు. ఆ లోపు మరో ఇద్దరు స్నేహితులను పిలిపించాడు. మాటల్లో పెట్టి ముగ్గురి బాలికలను యాదగిరి గుట్టకు తీసుకెళ్లారు. అక్కడ ఓ లాడ్జిలోకి తీసుకెళ్లి మైనర్లపై యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. తిరిగి వారిని హైదరాబాద్ నగరంలో వదిలిపెట్టారు. ఇంటికి చేరుకున్న బాలికలను ఎక్కడికెళ్లారని వారి తల్లిదండ్రులు నిలదీయడంతో జరిగిన ఘోరాన్ని చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాలికలకు కౌన్సిలింగ్ చేసి, అత్యాచారం జరిగినట్టు- పోలీసులు నిర్ధారించారు. అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకుని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులను జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి మధు(19), షాపింగ్ మాల్లో పనిచేసే వంశీ(22), పెట్రోల్ బంకులో పనిచేసే నీరజ్(21) గా పోలీసులు గుర్తించారు.

# దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం

న్యూఢిల్లీ: దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకమని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి సరైన అడుగులు పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..వివిధ రాష్ట్రాలతో తెలంగాణకు జాతీయ రహదారులు అనుసంధానం అయ్యాయని, జాతీయ రహదారుల నిర్వహణ వల్ల దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలియజేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై తెలంగాణ రహదారులపై చర్చించానని, రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారులకు నిర్మాణం చేపట్టాం అని పేర్కొన్నారు. రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు చేశామని, రూ.30 వేల కోట్లకు పైగా నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా.. తెలంగాణ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుకునే వ్యక్తుల్లో ముందువరసలో నేనుంటాను.. మా మంత్రిత్వ శాఖలో.. తెలంగాణ ప్రాజెక్టులకోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేసుకుని.. అన్నిరకాల అభివృద్ధి పనులను మానిటర్ చేస్తున్నాను.. మా పార్టీ తెలంగాణ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తుంది.. రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో విషయంలో.. అందరికంటే ముందే మేం ప్రొయాక్టివ్ గా వ్యవహరించామని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కు ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది.. మెట్రో విషయంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి.. ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నప్పుడు.. చాలా విషయాలపై స్పష్టత కావాలని అడుగుతారు.. మెట్రో విషయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసినపుడు.. వారు చాలా స్పష్టంగా చెప్పారు.. ఇప్పుడు మెట్రో రైల్ నిర్వహిస్తున్న ఎల్ అండ్ టి కొత్తగా



నిర్మాణం చేపట్టనున్న కంపెనీ మధ్య ఏమైనా ఒప్పందం జరిగిందా అని ప్రశ్నించారు.. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే నష్టాల్లో నడుస్తోంది.. ఇది రాష్ట్ర ప్రభుత్వంలోని అంశం. అది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. దీన్ని వారే తేల్చుకోవాలి.. మెట్రో అంశానికి అన్నిరకాలుగా మా సహకారం ఉంటుందని కిషన్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం పై సీబీఐ ప్రతిపాదనలు అందాయని పరిశీలనలో ఉందని తెలిపారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు బీజేపీ ఫోబియా పట్టుకుంది... రెండు పార్టీలు అర్ధం పర్ధం లేకుండా, ఆధారాల్లేకుండా.. మాట్లాడుతున్నారు. మీరు మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. మేం ఇండిపెండెంట్ గా ముందుకెళ్తాం.. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా.. బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా పనిచేస్తున్నాం.. బీసీ రిజర్వేషన్ పెరగాలని అసెంబ్లీలో మద్దతిచ్చాం.. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కాదు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా.. 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఇదే సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై ప్రతి ఒక్కరూ ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీల నేతలు విచిత్రమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. వాళ్లకు బిజెపి ఫోబియా పట్టుకుందన్నారు. చిల్లర మాటలు, అవగాహన లేకుండా, ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. బిజెపికి తెలంగాణలో ఎవరితో కలవాల్సిన అవసరం లేదన్నారు. కెసిఆర్, కేటీఆర్, బిఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బిజెపి ఎప్పుడు కలవదని స్పష్టం చేశారు. కలిసి కాపురాలు చేసింది మీరు.. ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుంది మీరు.. మంత్రి పదవులు పంచుకుంది మీరు.. బిజెపికి ఎటువంటి అవసరం లేదని ఫైర్ అయ్యారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా స్వతంత్రంగా పోటీ- చేస్తాం.. టిఆర్ఎస్, కాంగ్రెస్లకు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చేందుకే మా ప్రయత్నం చేస్తామని కిషన్ రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి వ్యవహారశైలి సమంజసంగా లేదు. జెన్ జీ విషయంలో కేటీఆర్ వ్యాఖ్యలు దేశద్రోహ వ్యాఖ్యలు.. నేపాల్ లో జరిగినట్లుగా.. పీఎం ఇంటిపైనా, మంత్రుల ఇంటిపైనా.. న్యాయస్థానాలపైనా దాడులు జరిగినట్లుగా.. ఇక్కడ జరగాలని కేటీఆర్ భావిస్తున్నారా? బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఇక్కడ అమలవుతోంది.. దేశంలో సమర్థవంతమైన నాయకత్వం ఉంది. అభివృద్ధి వేగవంతంగా సాగుతోంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే.. మనం వేగంగా పురోగతి సాధిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో.. కొందరు దివాళాకోరు మాటలు మాట్లాడం సరికాదు. ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాలని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# బాధ్యతారహితంగా జగన్ వ్యవహారం

అమరావతి:వైకాపా నేత జగన్.. ప్రజల పట్ల బాధ్యత లేకుండా వ్యవహరిస్తూ ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై చర్చ సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. వైకాపా నేతలు ఇటీవల చేస్తున్న 'రప్పా రప్పా' డైలాగులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఎన్టీఆర్ హయాం నుంచి తాము రాజకీయాల్లో ఉన్నామని.. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని స్పీకర్ అన్నారు. వైకాపా సభ్యులు సభకు రాకుండానే ప్రశ్నలు పంపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో గౌతు లచ్చన్న పార్టీ తరఫున 64 మంది ఎన్నికైతే ప్రతిపక్ష హోదా ఇచ్చారని.. అయితే సభ్యులు కొందరు పార్టీ మారిన నేపథ్యంలో ఆయన ప్రతిపక్ష హోదాను స్వయంగా వదులుకున్నారని గుర్తు చేశారు. జగన్ మాత్రం సంఖ్యాబలం లేకున్నా ప్రతిపక్ష హోదా అడగటమేంటని ప్రశ్నించారు. 'సభాపతిగా నేను ఈ కుర్చీలో కుర్చున్నా నాకు కూడా కొంత ఆవేదన కలుగుతోంది. ప్రెస్ మీట్, సోషల్ మీడియాలో రోజు చూస్తున్నాం వారు మాట్లాడే తీరు. మళ్లీ మేమే వస్తాం మీ అంతుచూస్తాం, పీకలు కోస్తాం... రప్పా రప్పా అంటూ సినిమా డైలాగులు. ఎన్టీఆర్ పార్టీలోనే మేము కూడా ఓడిపోలేదా.... ఓడిపోతే రప్పా రప్పా నా.... ఇందిరాగాంధీ వంటి మహనాయకురాలు ఓడిపోలేదా. మీలా మాట్లాడలేను ఆవేశం వస్తుంది.. అయితే కంట్రోల్ చేసుకోవాల్సి వస్తుంది' అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు వస్తాయని.. అయితే ప్రతిపక్షంగా ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడంలో లోటుపాట్లు- ఉంటే అసెంబ్లీకి వచ్చి చెప్పాలని సూచించారు.

# శ్రీశైలం,సాగర్‌లకు పెరుగుతున్న పర్యాటకులు



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నిండుకుండలా దర్శనమిస్తోంది. చాలాకాలం తరవాత మళ్లీ జలకళ సంతరించడంతో పర్యాటకుల రాక పెరిగింది. పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులలు కాగా 587 అడుగుల వద్ద నిలకడగా ఉండేలా చూస్తున్నారు. దీంతో నిండుకుండ ను తలపిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయిలో నిండడంతో తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. శ్రీశైలం జలాశయం కూడా నిండుకుండలా మారింది. ఎగువన వర్షాలతో మరింతగా వరదవచ్చి చేరుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీయులు నందికొండకు తరలిరావడంతో లాంచీ స్టేషన్, బుద్ధవనం, నాగార్జునకొండ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిట లాడాయి. చాలా మంది పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చగా అందుకు అనుగుణంగా తెలంగాణ టూరిజంశాఖ లాంచీలను నడిపించింది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడం, ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులు అన్ని నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరినందున ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించే అవకాశం ఉంది. సాగర్ నిండడంతో రిజర్వాయర్ పరిధిలో మత్స్యకార్మిక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా వచ్చి చేరిన కృష్ణమ్మ చూసి సంబుర పడుతున్నారు. సాగర్ లోతట్టు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్న గంగపుత్రులతో పాటు, చేపల వృత్తే జీవనాధారంగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు ఉపక్రమిస్తున్నారు. ఇరవైకి పైగా మర బోట్లు, పుట్టీలు ఉండగా వాటిల్లో చేపల వేటకు వెళ్తారు. కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి నిత్యం రూ.వేలల్లో ఆదాయం పొందుతారు. వేటాడిన చేపలు కేరళ, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. లోతట్టు ప్రాంతం వెంట జీవనం సాగిస్తున్న గిరిజనం సైతం చాలావరకు చేపల వేటను వృత్తిగా చేసుకుని బతుకుదెరువును సాగిస్తున్నది. ప్రభుత్వం వీరికి కూడా లైసెన్స్‌లు జారీచేసి ప్రభుత్వం పరంగా చేయూతనిస్తోంది. సాగర్ నిండటంతో గిరిజనులకు సైతం ఉపాధి మెండుగా కలుగుతున్నది. కృష్ణా నదిలో మత్స్యకారులు ఏడాదిలో 300 రోజులపాటు చేపల వేటను కొనసాగిస్తారు. గతకొంతకాలం చేపలవేటకు దూరమైన మత్స్యకారులు రిజర్వాయర్‌లోకి భారీగా వచ్చిన నీటితో తిరిగి చేపల వేటకు సన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాది రిజర్వాయర్‌లోకి భారీగా చేప పిల్లలను వదలడం.. అవి పెరిగి పెద్దవ్వడంతో పుష్కలంగా ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు.

# బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయి

న్యూఢిలీ: బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో నూకలు చెల్లాయని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమని ఆశాభావం వ్యక్తంచేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను వంతులవారీగా పంచుకున్నారని.. ఇప్పుడు వాటాల దగ్గర తేడా రావడంతో కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

జూబ్లీహిల్స్‌లో ఒక్క సామాజికవర్గానికే కాకుండా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అమలు చేస్తున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై సర్వేలు చేస్తున్నామని.. సర్వేలో ఎవరూ ముందుంటే వారికే సీటు ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో గెలిచే వారికి సీటు ఇస్తామని స్పష్టం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు. గురువారం ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు మహేష్ కుమార్ గౌడ్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చాలామంది రేసులో ఉన్నారని చెప్పుకొచ్చారు. సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, నవీన్ యాదవ్ , బొంతు రామ్మోహన్‌లతో సహా పలువురు జూబ్లీహిల్స్ టికెట్ అడుగుతున్నారని గుర్తుచేశారు. స్థానికులకు జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలనే డిమాండ్ ఉందని తెలిపారు. మంత్రుల కమిటీ, సర్వే ఫలితాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ కూడా కాంగ్రెస్ ఖాతాలోకే వస్తోందని చెప్పుకొచ్చారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని గుర్తుచేశారు. గాంధీ భవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం చాలా బాగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన తెలంగాణ డీసీసీల అంశంపై సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఏఐసీసీ కొత్తగా ఎంపిక చేసిన 22 మంది అబ్జర్వర్లు హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన 22 మంది అబ్జర్వర్లు తెలంగాణలో పర్యటిస్తారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హైడ్రాతో సామాన్యుడికి ఇబ్బంది లేదు. కబ్జా చేసిన వారికే హైడ్రాతో ఇబ్బందులు. ప్రభుత్వ భూమి పోకుండా ఉండేలా హైడ్రా పని చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు హైడ్రా కూలగొట్టడానికి వెళ్లింది, కానీ కోర్టు ఆర్డర్ స్థానికులు తీసుకొచ్చారు.

# ఉద్యోగుల సమస్యలపై మండలిలో వాడీవేడీ చర్చ

అమరావతి:పీఆర్సీ పునర్నిర్మాణం, బకాయిల చెల్లింపు అంశాలపై ఏపీ శాసనమండలిలో వాడీవేడిగా చర్చ సాగింది. వైకాపా ఎమ్మెల్సీల ప్రశ్నలకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమాధానమిచ్చారు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మునూ వైకాపా ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిల చెల్లింపునకు దశలవారీగా చర్యలు తీసుకుంటున్నట్లు- తెలిపారు. ఈ క్రమంలో ఉద్యోగుల సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ ఇచ్చిన సమాధానంపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి మోసపూరితమైన మాటలు నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యోగులను , ప్రజలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగుల ఆవేదనకు మద్దతు తెలుపుతూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నామంటూ బొత్స సత్యనారాయణ సభ నుంచి వెళ్లిపోయారు. అంతకుముందు మంత్రి పయ్యావుల ఉద్యోగుల సమస్యలపై మాట్లాడుతూ గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గత సర్కార్ దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. ఉద్యోగుల జీపీఎఫ్‌ను వివిధ అవసరాలకు వాడుకుని... ఇప్పుడు ఉద్యోగుల విషయంలో మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు- ఉందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఇచ్చిందన్నారు.ఐఆర్ కంటే తక్కువగా 23 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అన్యాయం చేశారని.. కరోనా పేరు చెబుతూ ఉద్యోగుల ఫిట్‌మెంట్‌ను వైసీపీ సర్కార్ తగ్గించిందని విమర్శించారు.

ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిల చెల్లింపునకు దశలవారీగా చర్యలు తీసుకుంటు-న్నామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. ఉద్యోగుల వేతనాల పెంపు కోసం పీఆర్సీ కమిషన్ నియామకంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# 30న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం.




**హాజరు కానున్న రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ.**
**ముఖ్య అతిథిగా ఇగ్నో ఉపకులపతి ప్రొ. ఉమా కాంజీలాల్.**
**ప్రఖ్యాత ప్రజా కవి, గాయకులు గోరేటి వెంకన్న, ప్రముఖ విద్యావేత్త ప్రేమ్ రావత్ లకు గౌరవ డాక్టరేట్లు.**
**డిగ్రీలో 35, పీజీలో 51 బంగారు పతకాలు.**
**ఇద్దరు ఖైదీలకు బంగారు పతకాలు.**
**వివరాలు వెల్లడించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి.**

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్, సెప్టెంబర్ 25:**

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవం ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి వెల్లడించారు. గురువారం క్యాంపస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డా. యల్. విజయ కృష్ణా రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ. బోజు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇరవై ఆరో స్నాతకోత్సవం ఈ నెల 30న మంగళవారం ఉదయం 10.00 గంటలకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని భవనం వెంకట్రామ్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాలను, ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు, బుక్ ప్రైజ్ లను అందించనున్నట్లు వివరించారు.

ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) న్యూఢిల్లీ ఉపకులపతి ప్రొ ఉమా కాంజీలాల్ హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 60,288 మంది అభ్యర్థులు తమ డిగ్రీలు / డిప్లొమాలు / సర్టిఫికెట్లు పొందనున్నట్లు వెల్లడించారు.

ఈ స్నాతకోత్సవంలో ప్రఖ్యాత కవి, గేయ రచయిత గోరటి వెంకన్న కు తెలుగు సాహిత్యానికి వ్యాప్తికి వారు చేసిన సేవలకు గాను స్నాతకోత్సవ కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ అందించనున్నారు. అదేవిధంగా ప్రఖ్యాత శాంతి విద్యా ప్రచారకులు, ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకర విధానంలో పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంపొందించి, నేరాల శాతం తగ్గించడానికి కృషి చేస్తున్న ప్రముఖ రచయిత, ప్రఖ్యాత విద్యా వేత్త ప్రేమ్ రావత్ కు ఆయా రంగాల్లో ఆయన చేసిన సేవలకు గాను డాక్టర్ ఆఫ్ లెటర్స్ (హానరిస్ కాసా %-% గౌరవ డాక్టరేట్)తో సత్కరించబోతునున్నట్లు వెల్లడించారు.





**26వ స్నాతకోత్సవం ముఖ్య అంశాలు:**

స్నాతకోత్సవంలో డిగ్రీలు /డిప్లొమా సర్టిఫికెట్లు పొందునున్న విద్యార్థులు 60,288. ఇందులో భాగంగా అండర్ గ్రాడ్యుయేట్ లో 35,346, పోస్ట్ గ్రాడ్యుయేట్ లో 24,942 మంది సర్టిఫికెట్స్ అందుకోనున్నారు.

- అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ మహిళా విద్యార్థులు 32,373 అభ్యర్థులు, 7 ట్రాన్స్ జెండర్ అభ్యర్థులతో సహా పురుషులు 27,908 మంది డిగ్రీలు అందుకోనున్నారు.
- మొత్తం 86 బంగారు పతకాలు (అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో 35 గోల్డ్ మెడల్స్ , పోస్ట్ గ్రాడ్యుయేట్ 51 బంగారు పతకాలు అందుకోబోతున్నారు.
- ఎం ఫిల్ మరియు పీహెచ్ డీ డిగ్రీలు : 53 మంది పీహెచ్ డీ మరియు ఇద్దరు ఎంఫిల్ పట్టాలు అందుకోబోతున్నారు.
- మొత్తం 86 బంగారు పతకాలు ప్రదానం చేయనున్నారు. అందులో మహిళలు : 67 మంది, పురుషులు : 19 మంది అందుకోనున్నారు.
- అండర్ గ్రాడ్యుయేట్ లో మహిళలు 29 బంగారు పతకాలను, పురుషులు 6 పతకాలను అందుకోనున్నారు.
- పోస్ట్ గ్రాడ్యుయేట్ లో మహిళలు 38 బంగారు పతకాలు, పురుషులు 13 బంగారు పతకాలు పొందనున్నారు.
- మొత్తం 203 మంది వివిధ జైళ్లలో అభ్యసించిన ఖైదీ అభ్యర్థులు డిగ్రీలు పట్టాలు పొందనున్నారు.
- ఖైదీల్లో 168 మంది అండర్ గ్రాడ్యుయేట్ (పురుష ఖైదీలు 149, మహిళా ఖైదీలు 19 మంది), 35 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ (పురుష ఖైదీలు 34, మహిళా ఖైదీలు ఒకరు) డిగ్రీలు అందుకోబోతున్నారు. వీళ్లలో ఇద్దరు ఖైదీలు గునకల్ యుగంధర్, యూజీ. అడ్మిషన్ నంబర్. 1662049651 మరియు పీజీ అడ్మిషన్ నంబర్. 16621081436 (కేంద్ర కారాగారం, కడప) దొప్పల్పూడి నాగరాజ కుమారి. అడ్మిషన్‌నంబర్. 0742144276 (కేంద్ర కారాగారం, రాజమండ్రి) బంగారు పతకాలు, బుక్ ప్రైజ్‌లు అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.
- యూనివర్సిటీ ప్రారంభమైన 1982-83 విద్యా సంవత్సరం నుంచి నేటి వరకు 5,91,030 మందికి డిగ్రీలు ప్రదానం చేసింది.

**బ్లాక్ చైన్ టెక్నాలజీ :**

యూనివర్సిటీ పూర్తిగా డిజిటలైజేషన్ సాధించి ఈ స్నాతకోత్సవం నుంచి బ్లాక్ చైన్‌టెక్నాలజీని ఉపయోగిస్తోంది. దీని వల్ల అన్ని సర్టిఫికెట్లు అత్యంత భద్రమైన డిజిటల్ బ్యాంకులో నిల్వ ఉంటాయి. విద్యార్థులు వారి అవసరం మేరకు వాటిని డౌన్ లోడ్ చేసుకోవచ్చు. బ్లాక్ చైన్‌టెక్నాలజీ వినియోగించడం ద్వారా పారదర్శకంగా, ప్రామాణికంగా ఉంటుంది. ఫేక్ సర్టిఫికెట్స్ తయారు చేయడానికి, సమాచారాన్ని మార్చడానికి ఆస్కారం ఉండదనీ వివరించారు.

# రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, సెప్టెంబర్ 25**



జిల్లాలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి జిల్లాలో ధన, ప్రాణ నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ గురువారం సాయంత్రం అత్యవసరంగా అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్లో ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున ఇటీవల జిల్లాలో సంభవించిన భారీ వర్షాల వలన కలిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాస్థాయి నుడి గ్రామస్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేసి ధన, ప్రాణ నష్టం కలగకుండా చూడాలని అన్నారు. ఈమధ్య భారీ వర్షాల వలన కలిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ అధికారుల సూచనలను పాటిస్తూ అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దు, చేపలు పట్టడానికి నీటివనరుల వద్దకు వెళ్ళవద్దు, ప్రమాదకరంగా ప్రవహించే వాగులు, వంకలకు దూరంగా ఉండాలి, లో లెవెల్ బ్రిడ్జిలు, వంతెనల పై నుండి ప్రయాణాలు చేయరాదు, విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదు అని ప్రజలకు సూచించారు. ఈ టెలికంఫరెన్స్ లో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, ఆర్డీవోలు, ఇరిగేషన్ సిఇ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, విద్యుత్తు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ, సిపిఓ, డిఎల్పివోలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ వర్సిటీలో ఘనంగా బతుకమ్మ సంభరాలు

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్, సెప్టెంబర్ 25:**





డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయలో బతుకమ్మ పండగా సంభరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.యల్. విజయ కృష్ణారెడ్డి, మహిళా విభాగ ఇంచార్జ్ ప్రొ.కె. రాణి రజిత మాధురి ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులకు రిజిస్ట్రార్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణా లో బతుకమ్మ పండగ విశిష్టతను వివరించారు. విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ కార్యక్రమంలో ప్రొ.ఇ.సుధా రాణి, ప్రొ.పల్లవీ కబ్డే, ప్రొ. రజని, ప్రొ. చంద్రకళ, డా. ఎ. రమా దేవి, మంజుల, సులోచన, సుహాసిని, రుశేంద్ర మణి, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో అన్ని విభాగాల మహిళా ఉద్యోగులు, అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోర్సుల్లో చేరితే విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు..

**విశాఖపట్నం:** పర్యాటకంగా అభివృద్ధి చెందుతుండటంతో హోటల్స్ సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ తక్కువ ఫీజులతో విదేశీ వంటకాల శిక్షణ ఇస్తోంది. ఏడాదిన్నర కోర్సులో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. రక్షణ రంగ ఉద్యోగులకు అసిస్టెంట్ క్యాటరింగ్ మేనేజర్ కోర్సు కూడా ఉంది. డిగ్రీలు చదివిన నిరుద్యోగులకు ఇది మంచి అవకాశం. శిక్షణ పొందిన వారికి దేశ, విదేశాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ఈ క్రమంలో హోటల్స్, ఆతిథ్య రంగంలో ఉద్యోగాలు వస్తున్నాయి. అయితే ప్రైవేటు హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలు మాత్రమే కాదు.. ప్రభుత్వ రంగంలో ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ తక్కువ ఫీజులతో శిక్షణ ఇస్తోంది.. ఇక్కడ విదేశీ వంటలు కూడా నేర్పించి అక్కడ ఉద్యోగ అవకాశాలు పొందేలా చేస్తారు. విశాఖపట్నంలో ఈ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ జూపార్కు దగ్గర ఉంది.



ఈ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో.. సర్టిఫికెట్ కోర్సు ఇన్ అడ్వాన్స్‌డ్ ట్రేడ్ ఇన్ కలినరీ ఆర్ట్స్ (ఏడాదిన్నర) అందుబాటులో ఉంది. ఈ కోర్సులో చేరేవారికి ఆరు నెలల పాటూ ఇండస్ట్రియల్ శిక్షణ అందిస్తారు.. కోర్సు ఫీజు రూ.30వేలు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో మొత్తం 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ శిక్షణలో సౌత్, నార్త్ ఇండియన్‌తో పాటుగా చైనీస్ వంటలు నేర్పిస్తారు. అలాగే ఏషియన్, అమెరికన్, యూరోపియన్ వంటలు కూడా ట్రైనింగ్ ఇస్తారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సు పూర్తి చేసినవారికి చెఫ్, అసిస్టెంట్ చెఫ్‌తో పాటుగా చీఫ్ కుక్, కుక్ లాంటి కేటగిరీలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. అది కూడా దేశ, విదేశాల్లోని స్టార్ హోటళ్లలో ఉద్యోగాలు చేయొచ్చు. ఈ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో అసిస్టెంట్ క్యాటరింగ్ మేనేజర్ కోర్సు కూడా అందుబాటులో ఉంది. ఈ కోర్సులో చేరడానికి ఆరునెలల్లో పదవీ విరమణ చేసే రక్షణ రంగ ఉద్యోగులు అర్హులు. ఈ కోర్సు పూర్తి చేస్తే హోటళ్లలో కుక్‌గా ఉద్యోగంలో చేరొచ్చు. అంతేకాదు సొంతంగా హోటల్స్‌తో పాటుగా క్యాటరింగ్, కర్రీ పాయింట్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే టెక్నిక్స్ ఇన్ కుకింగ్ ఐదు నెలల కోర్సు కూడా అందుబాటులో ఉంది. ఈ కోర్సులో చేరితే వెజ్, నాన్‌వెజ్, వంటల్లో మెళుకువలు నేర్పిస్తారు.. విద్యార్హత, వయసుతో సంబంధం లేదు ఎవరైనా నేర్చుకోవచ్చు. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సు చాలామందికి మంచి అవకాశం అని చెప్పాలి.

కొందరు డిగ్రీలు, పీజీలు చదివినా ఉద్యోగాలు రాలేదు.. అయితే చాలామంది ఈ కోర్సుల్లో చేరి శిక్షణ తర్వాత ఉద్యోగాలు సంపాదిం చారు. కొందరు విశాఖపట్నం, హైదరాబాద్ సహా పలు నగరాల్లోని హోటల్స్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. అంతేకాదు వీరికి మంచి, మంచి ఉద్యోగ ఆఫర్లు వస్తున్నాయట. విశాఖపట్నంలో కూడా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి.. నగరంలో హోటల్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యం పెరుగుతోందని చెబుతున్నారు. అలాగే విశాఖపట్నానికి విదేశీయులు వస్తుండటంతో వీరికి హోటల్స్ నుంచి మంచి డిమాండ్ ఉంది. మొత్తం మీద యువతకు, నిరుద్యోగులకు ఆతిథ్య, హోటల్స్ రంగంలో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి.

# బ్రహ్మోత్సవాలకు వెళుతున్నారా..



**తిరుమల** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు దేశ, విదేశాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారనే అంచనాలతో టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది. దర్శనం, వసతి, భద్రతకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. అయితే భక్తుల భద్రత కోసం పోలీసులు కొన్ని సూచనల చేశారు. భక్తులు ఎవరైనా తప్పిపోయినా, ఏవైనా చోరీలు జరిగినా.. వెంటనే సమీపంలో విధుల్లో ఉన్న పోలీసులు, సమీపంలోని స్టేషన్, హెల్ప్‌డెస్క్‌కు సమా చారం ఇవ్వాలని సూచించారు. తిరుపతిలో ఉండే హోమ్‌స్టేలు, హోటల్స్, లాడ్జీలు ఉండగా.. బోర్డులో ఉండే ధరలకే గదులు కేటాయిం చాలంటున్నారు పోలీసులు. భక్తులకు తాగునీరు, పార్కింగ్, వాష్‌రూమ్ వెసులు బాటు కల్పించాలంటున్నారు. ఒకవేళ ఎవరైనా అమర్యాదగా ప్రవర్తించినా, అధికంగా వసూలు చేసినా కమాండ్ కంట్రోల్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. తిరుమలకు వెళ్లే జీపులు, ట్యాక్సీల్లో వెళ్లే ప్రయాణికుల నుంచి పెద్దకు రూ.110, పిల్లలకు రూ.60 ఛార్జీగా నిర్ణయించారు. ఒకవేళ ఎవరైనా అధికంగా వసూలు చేస్తే విధుల్లో ఉన్న పోలీసులు, ఆర్టీఏ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా భక్తులు బైక్ రైడర్లు, రెంటల్ కార్లు కూడా అందుబాటులో ఉన్నాయి. తిరుపతిలో ఆటోవాలాలు అధిక ఛార్జీలు వసులు చేసినా, అమర్యాదగా ప్రవర్తించినా డయల్ 112, 80999 99977 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. ట్రాఫిక్ పైనా సమాచారం ఇవ్వొచ్చు. ఇకవేళ ఎవరైనా భక్తులు మొబైల్ పోగొట్టుకుంటే వెంటనే 'సీఈఐఆర్.కామ్' పోర్టల్‌లో నమోదు చేయాలి. మొబైల్ హంట్ వాట్సప్ నంబర్‌కు హా య్ అని టైప్ చేస్తే వచ్చే లింక్ ద్వారా వివరాలు నమోదు చేయగానే ఫిర్యాదు స్వీకరి స్తారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌పై కూడా భక్తులు ఫిర్యాదు చేయొ చ్చు..

# దుర్గమ్మ దర్శనానికి వెళ్తున్నారా..

# ఏపీటీడీసీ స్పెషల్ టూర్ ప్యాకేజీ..

**విజయవాడ:** దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇరుగు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా దుర్గమ్మ భక్తులు.. అమ్మవారి దర్శనం కోసం తరలి వస్తున్నారు. దీంతో బెజవాడ ఇంద్రకీలాద్రి కిటకిటలాడుతోంది. ఈ నేపథ్యంలోనే విజయవాడ కు వచ్చే దుర్గమ్మ భక్తుల కోసం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక టూర్ ప్యాకేజీ తీసుకువచ్చింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 22 నుంచి సెప్టెంబర్ 28 వ తేదీ వరకూ.. అలాగే సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. ఈ తేదీలలో హైదరాబాద్ - విజయవాడ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఉదయం ఐదు గంటలకు మియాపూర్ నుంచి, ఉదయం ఐదు గంటల 20 నిమిషాల నుంచి కేపీహెచ్‌బీ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. కూకట్ పల్లి నుంచి ఉదయం ఐదు గంటల 30 నిమిషాలకు, అమీర్ పేట నుంచి ఉదయం 5 గంటల 50 నిమిషాలకు విజయవాడకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే బేగంపేట్ నుంచి ఉదయం 5.55 గంటలకు.. దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఉదయం 6.15 గంటలకు.. ఎల్బీనగర్ నుంచి ఉదయం 6 గంటల 25 నిమిషాలకు విజయవాడకు బస్సులు బయల్దేం ˇతాయని ఏపీటీడీసీ తెలిపింది. దుర్గమ్మ దర్శనం పూర్తైన అనంతరం.. హైదరాబాద్‌లోని ఆయా ప్రాంతా లకు రాత్రి 11 గంటలకు చేరుకుంటాయని ఏపీటీడీసీ వెల్లడించింది. మరిన్ని వివరాల కోసం 77298 30011, 77298 20011 నంబర్లను సంప్రదించాలని సూచించింది.

**దుర్గగుడిలో భక్తుల రద్దీ**

మరోవైపు దుర్గ గుడిలో భక్తుల రద్దీ నెలకొంది. ప్రొటోకాల్ దర్శనాల తాకిడి ఎక్కువైంది. దీంతో సామాన్య భక్తులు మంగళవారం ఇబ్బందులు పడ్డారు. అలాగే వీఐపీల కోసం ప్రత్యేక వేళలను అధికారులు కేటాయించారు. అయినప్పటికీ వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీఐపీలు, ప్రోటోకాల్ ప్రముఖులు తమకు కేటాయి ంచిన సమయంలో కాకుండా నచ్చినప్పుడు రావటం తో సాధారణ భక్తులు ఇబ్బందులు పడుతున్నా రని విమర్శలు వస్తున్నాయి. దీంతో వీఐపీలు వారికి కేటాయించిన సమయాల్లోనే దర్శనం కోసం రావాలని ఆలయ ఈవో శీనానాయక్ విజ్ఞప్తి చేశారు. ఉదయం 7 నుంచి 9గంటలవరకు, మధ్యాహ్నం 3నుంచి 5 గంటల వరకు ప్రొటోకాల్ దర్శనాలకు కేటాయిం చారు.




**దుర్గ గుడిలో వీఐపీ దర్శనాలు రద్దు**

మరోవైపు విజయవాడ దుర్గగుడిలో బుధవారం సాయంత్రం వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ బుధవారం విజయవాడకు రానున్నారు. సాయంత్రం దుర్గమ్మను దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ బుధవారం సాయంత్రం మూడు గంటల నుంచి 5 గంటల మధ్య కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే వీఐపీ బ్రేక్ దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# స్నేహ సొసైటీలో ఘనంగా "బతుకమ్మ" వేడుకలు.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ప్రాజెక్టులో పనిచేస్తున్న ఆయా కార్యక్రమాల సిబ్బంది తో కలిసి బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేంద్ర గుప్తా హాజరై ప్రసంగించారు. తెలంగాణ సంప్రదాయ పండుగ అయిన బతుకమ్మ మహిళలకు ఎంతో ప్రత్యేకమైనదని, ఇది దైవ భక్తితో కూడుకున్నదే కాదని, బతుకమ్మ ఆడటం మహిళలకు ఎంతో ఆరోగ్యకరమని అన్నారు. కాబట్టి మన పూర్వీకులు బతుకమ్మ పండుగకు ఒక ప్రత్యేకతను ఇచ్చారని చెప్పారు. స్నేహ సొసైటీ తో తన అనుబంధం 30 ఏళ్ల నాటిదని ఆయన తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈరోజు స్నేహ సొసైటీ లోని దివ్యాంగ బాలలు మరియు సిబ్బందితో కలవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన తెలిపారు. మహిళా మణులు ఎంతో సంతోషంగా సహజసిద్ధమైన రకరకాల రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ పండుగ ను ఘనంగా జరుపుకున్నారు.

**స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య మాట్లాడుతూ,**

బతుకమ్మ పండుగ అనేది మహిళలు జరుపుకునే పెద్ద పండుగని ప్రకృతిలో లభించే పూలను పూజించే పండుగ ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ లేదని, అది తెలంగాణ ప్రత్యేక పండగానీ, సాంప్రదాయాలకు సాంస్కృతికి బతుకమ్మ ఒక ఉదాహరణని అన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు తెలంగాణ సాంప్రదాయ పండుగైన బతుకమ్మను ఎంతో గొప్పగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ బతుకమ్మ ఉత్సవాల్లో స్నేహ సొసైటీ సభ్యులు టీ. వీరేశం, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి, మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ టార్గెటేడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు మేనేజర్ బాలరాజు స్నేహ సొసైటీ వివిధ కార్యక్రమాల్లో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలకు "బతుకమ్మ" అతి పెద్ద పండుగ.



**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, సెప్టెంబర్ 25**

బతుకమ్మ పండుగ మహిళా సోదరీమణులకు అతిపెద్ద పండుగ అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్లో మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డిలతో కలిసి మహిళలతో బతుకమ్మ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ అంటేనే మహిళలకు ఒక ప్రత్యేక అనుభూతి అని అన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకు అన్ని పండుగలలో పెద్ద పండుగ అని, బతుకమ్మ పండుగ ఆడడానికి మహిళలు ఎంతో ఉత్సాహాన్ని చూపి ఎంతో సంతోషంగా, ఆనందంగా జరుపుకుంటారని అన్నారు. జిల్లాలో బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించాలనే ప్రభుత్వ సూచనల మేరకు ప్రతిరోజు కలెక్టరేట్లో బతుకమ్మ ఉత్సవాల నిర్వహించడంతోపాటు జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో ప్రభుత్వ ఉద్యోగులు సంతోషంగా బతుకమ్మ పండుగను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఎక్సైజ్ సూపరింటిండెంట్ హనుమంతరావు హనుమంతరావు, ఎక్సైజ్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా ఉద్యోగులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, టీఎన్జీవో ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏకాత్మతా మానవతా వాద సిద్ధాంతమే దేశ అభివృద్ధికి మంత్రం.




**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**

**బీజేపీ కార్యాలయం, స్నేహ సొసైటీ లో దీన్ దయాళ్ జయంతి.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ఏకాత్మతా మానవతా వాద సిద్ధాంతమే దేశ అభివృద్ధికి మంత్రం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మరియు మారుతీ నగర్ లోని స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ, భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్నవారి నోర్లు మూయించడానికి ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మహోన్నత వ్యక్తి పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ అన్నారు.

దీన్ దయాల్ జీ ఆశించినట్టుగా చిట్టాచివరి పేదోనికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్న సంకల్పంతో భారత దేశాన్ని శక్తివంతమైన, సౌభాగ్యమైన దేశంగా, ప్రపంచ దేశాలలో విశ్వగురువుగా నెలబెట్టాలనే ఆశయంతో, జాతీయ పునరనిర్మాణం లక్ష్యంగా భారతీయ జనతా పార్టీని స్థాపించడం జరిగిందని అన్నారు. దీన్ దయాల్ జీ రూపొందించిన ఏకాత్మతా మానవతా వాదం సిద్ధాంతం ఆధారంగానే బిజెపి మొదట 2 సిట్ల నుండి ఈ రోజు దాదాపు 300 సిట్లతో మూడు సార్లు వరసగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగి ప్రపంచ దేశాలకు భారత్ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ దేశంలో అట్టడుగు స్థాయి పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలనే దీన్ దయాల్ జీ ఆకాంక్షలకు అనుగుణంగా ఈ దేశ ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగిందన్నారు. గత 11 ఏళ్ల నరేంద్రమోదీ, బిజెపి పరిపాలన చూస్తే అనేక విప్లవత్మక విజయాలతో పాటు సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి అవస్ యోజన, గరీబ్ అన్న కళ్యాణ్ యోజన, ఆయుష్మాన్ భారత్, పసల్ భీమా యోజన, ఉజ్వల యోజన, సూకన్య సమృద్ధి యోజన, ముద్ర లోన్స్, విశ్వకర్మ యోజన ఇలా అనేక సంక్షేమ పథకాల ద్వారా దేశ ప్రజలు లబ్ధిపొందడం జరిగిందన్నారు. వికసిస్తున్న భారత దేశంలో బిజెపి సాధించిన విప్లవత్మక విజయాలు ఎన్నో ఉన్నా ఇంకా సాధించవలసినవి కూడా చాలా ఉన్నాయని, భారత దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టాలన్న శ్యామప్రసాద్ ముఖర్జీ, దీనదయాల్ ఉపాధ్యాయ, అటల్ జీ అద్వానీలా కల సాకారం చేయాలన్నా. ఈ దేశాన్ని అఖండ భారతంగా తీర్చిదిద్దలన్నా కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో పని చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, ప్రధానకార్యదర్శులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, పోతంకర్ లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తేనే ఆసుపత్రులకు అనుమతి.



**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, సెప్టెంబర్ 25:**

ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్టిక్ రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త ఆస్పత్రులుగాని, రోగ నిర్ధారణ కేంద్రాలు గాని ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకొని మాత్రమే ఆసుపత్రి నడపాలని అన్నారు. అనుమతి లేని ఆసుపత్రులకు, రోగ నిర్ధారణ కేంద్రాలకు నోటీసులు జారీ చేయాలని అనుమతి లేని ఆస్పత్రులు గాని రోగనిర్ధాన కేంద్రాలు గాని అడ్వర్టైజ్మెంట్ చేయకూడదని అన్నారు. అర్హత లేని వారు వైద్యం చేయరాదని అలా చేస్తే అలాంటి ఆసుపత్రులను వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు విధిగా ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి రిజిస్ట్రేషన్ ను పరిశీలించాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, డిసిహెచ్ఎస్ విజయలక్ష్మి, జిల్లా ఉపవైద్యాధికారులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా "బతుకమ్మ సంబరాలు".





**- గౌరీమాతకు పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, కలెక్టర్.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 25 :**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో టీఎన్జీఓ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎంతో ఉత్సాహంగా ఆడిపాడారు. బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు, రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు, యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దాండియా, కోలాటాలతో బతుకమ్మ సంబురానికి వన్నె చేకూర్చారు. ఈ సంద ర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ పనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు. ఈ ఉత్సవాల్లో టీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు పాల్గొన్నారు.






# సీతాయిపేట్‌లో అట్టహాసంగా ఇందిరమ్మ గృహ ప్రవేశాలు.

**- ప్రారంభోత్సవాలు చేసిన రూరల్ ఎమ్మెల్యే, కలెక్టర్.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 25**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లి మండలం, సీతాయిపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఇందిరమ్మ ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేశారు. వేద బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా పూజలు జరిపించి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన మానస, స్వరూప, నిశాంత్, సాయిరాం, గంగాధర్ లను వారి కుటుంబ సభ్యులతో కలిసి గృహ ప్రవేశాలు చేయించారు. రూరల్ నియోజకవర్గంలో25 మొట్టమొదటి ఇందిరమ్మ గృహ ప్రవేశాలు కావడంతో ఎమ్మెల్యే భూపతి రెడ్డి లబ్ధిదారులకు తన తరపున స్వయంగా నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ లు లబ్ధిదారులకు నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో సొంతింటి కల సాకారం చేసుకోగలిగామని లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కాగా, లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో బిల్లులు అందాయా? ఇంటి నిర్మాణం విషయంలో అధికారులు తోడ్పాటును అందించారా? అని కలెక్టర్ లబ్ధిదారులను ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్, తాగునీరు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా లబ్ధిదారులు కూడా త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఇళ్లను కట్టుకోవాలని, అనవసర ఆర్భాటాలకు పోయి అప్పుల పాలు కాకూడదని కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.